భారత్ 46 ఆలౌట్

స్వదేశంలో టీమ్‌ఇండియాకు టెస్టుల్లో అత్యల్ప స్కోరు • కివీస్ పేసర్ల ధాటికి పెవిలియన్‌కు క్యూ కట్టిన బ్యాటర్లు

హెన్రీ, ఓరూర్కీ దెబ్బకు విలవిల • నిలకడగా ఆడుతున్న న్యూజిలాండ్ • చేజారిన కాన్వే శతకం

13, 2, 0, 0, 20, 0, 0, 0.. ఇవీ ప్రపంచ అగ్రశ్రేణి బ్యాటర్లుగా వెలుగొందుతున్న భారత స్టార్ బ్యాటర్ల స్కోరు వివరాలు. సగటు భారత క్రికెట్ అభిమాని కలలో కూడా ఊహించని ఈ అవమానకర వైఫల్యానికి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ప్రత్యక్ష సాక్ష్యమైంది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో కివీస్ పేసర్ల ధాటికి టీమ్‌ఇండియా పెవిలియన్‌కు క్యూ కట్టింది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సర్ఫరాజ్ ఖాన్, జైస్వాల్, కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, అశ్విన్.. ఇలా వచ్చినోళ్లు వచ్చినట్టే పెవిలియన్ బాట పట్టడంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ అత్యంత అవమానకర రీతిలో 46 పరుగులకే కుప్పకూలింది. కివీస్ పేసర్లు హెన్రీ, ఓరూర్కీ దెబ్బకు ఒక్కరంటే ఒక్కరు కూడా ఎదురునిలవలేక చతికిలపడ్డారు. భారత్‌ను అత్యల్ప స్కోరుకే పరిమితం చేసిన కివీస్.. బ్యాటింగ్‌లో నిలకడగా ఆడుతూ రెండో రోజు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడమే గాక ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరుకుంది.

బెంగళూరు: స్వదేశంలో తిరుగులేని జట్టుగా మన్నలు పొందుతున్న రోహిత్ సేనకు న్యూజిలాండ్ దిమ్మతిరిగే షాకిచ్చింది. బెంగళూరులోని చిన్నస్వామి వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భారత్‌ను 46 పరుగులకే ఆలౌట్ చేసి మ్యాచ్‌పై పట్టు బిగించింది. 92 ఏండ్ల భారత క్రికెట్ చరిత్రలో స్వదేశంలో ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. మొదటి రోజు ఆట వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయినా రెండో రోజు ఆరంభంలో పేసర్లకు సహకరించిన పిచ్‌పై కివీస్ బౌలర్లు మ్యాట్ హెన్రీ (5/15), విలియమ్ ఓరూర్కీ (4/22) దెబ్బకు టీమ్‌ఇండియా బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. భారత బ్యాటర్లలో ఏకంగా ఐదుగురు డకౌట్ అవ్వగా ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. రిషభ్ పంత్(20) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఆ జట్టు ఓపెనర్ డెవాన్ కాన్వే (105 బంతుల్లో 91, 11 ఫోర్లు, 3 సిక్సర్లు) తృటిలో శతకం చేజార్చుకోగా విల్ యంగ్ (33) రాణించాడు.

వచ్చారు.. వెళ్లారు!

రెండో రోజు వరుణుడు తెరిపినివ్వడంతో అనుకున్న సమయానికే ఆట ఆరంభమవగా టాస్ గెలిచిన భారత సారథి రోహిత్ శర్మ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. గత నాలుగు రోజులుగా ఇక్కడ కురిసిన వర్షాలతో చిన్నస్వామి పిచ్ అనూహ్యంగా పేసర్లకు అనుకూలించింది. దీంతో కివీస్ పేస్ త్రయం టిమ్ సౌథీ, మ్యాట్ హెన్రీ, విలియమ్ ఓరూర్కీ వికెట్ల పండుగ చేసుకున్నారు. ఆరంభం నుంచే రోహిత్ (2)ను ఇబ్బందిపెట్టిన సౌథీ.. ఏడో ఓవర్లో భారత్‌ను తొలి దెబ్బతీశాడు. ఆ ఓవర్ మూడో బంతికి సౌథీ వేసిన ఇన్‌స్వింగర్‌ను ముందుకొచ్చి ఆడబోయిన హిట్‌మ్యాన్.. బంతి బ్యాట్ ఎడ్జ్‌కు తాకి లెగ్‌స్టంప్‌ను పడగొట్టడంతో పెవిలియన్ చేరాడు. సుమారు 8 ఏండ్ల తర్వాత టెస్టులలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లీ.. ఓరూర్కీ 9వ ఓవర్లో గ్లెన్ ఫిలిప్స్ పట్టిన అద్భుతమైన క్యాచ్‌తో డకౌట్‌గా వెనుదిరిగాడు. గిల్ స్థానంలో జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్ కూడా పరుగుల ఖాతా తెరవకుండానే నిష్క్రమించాడు. హెన్రీ బౌలింగ్‌లో ఓ చెత్త షాట్ ఆడి ఎక్స్‌ట్రా కవర్ వద్ద కాన్వే ముందుకు డైవ్ చేస్తూ పట్టిన క్యాచ్‌తో అతడి కథ ముగిసింది. ఆ తర్వాత రిషభ్, యశస్వీ జైస్వాల్ (13) 11 ఓవర్ల పాటు వికెట్‌ను కాపాడుకున్నారు. డ్రింక్స్ తర్వాత హెన్రీ 20వ ఓవర్లో జైస్వాల్.. అజాజ్ పటేల్ చేతికి చిక్కడంతో భారత్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఆదుకుంటాడనుకున్న కెఎల్ రాహుల్ కూడా సున్నాకే ఔటై నిరాశపరిచాడు. లంచ్‌కు ముందు బంతికి జడేజా (0), తర్వాతి బంతికి అశ్విన్ (0) కూడా ఔట్ అయ్యారు. కాసేపు పోరాడిన పంత్‌ను 26వ ఓవర్లో హెన్రీ ఔట్ చేయడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. లోయరార్డర్‌లో కుల్‌దీప్ (1), బుమ్రా (1), సిరాజ్ (4 నాటౌట్) కూడా భారత్‌ను 50 పరుగుల మార్కును దాటించలేకపోయారు. కివీస్ ఫీల్డర్లు అద్భుతమైన క్యాచ్‌లు అందుకుని ఆతిథ్య జట్టును 31.2 ఓవర్లలోనే పెవిలియన్‌కు సాగనంపడటంలో కీలకపాత్ర పోషించారు.

కివీస్ నిలకడగా..

భారీ బ్యాటింగ్ లైనప్ ఉన్న రోహిత్ సేన బొక్కబోర్లా పడ్డా కివీస్ మాత్రం ఆచితూచి ఆడింది. ఓపెనర్లు కాన్వే, టామ్ లాథమ్ (17) తొలి వికెట్‌కు 67 పరుగులు జోడించారు. ఆకాశ్ దీప్‌ను పక్కనబెట్టి ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన భారత్‌కు 17 ఓవర్ల దాకా వికెట్ దక్కలేదు. ఎట్టకేలకు 18వ ఓవర్లో కుల్‌దీప్.. లాథమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కానీ మూడో స్థానంలో వచ్చిన విల్ యంగ్‌తో కలిసి కాన్వే భారత బౌలర్లను దీటుగా ఎదుర్కున్నాడు. రోహిత్ పదే పదే బౌలర్లను మార్చినా ఈ ద్వయం నిలకడగా పరుగులు రాబట్టింది. టీ విరామానికి ముందే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న కాన్వే క్రీజులో కుదురుకున్నాక బ్యాట్‌కు పనిచెప్పాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని 37వ ఓవర్లో జడ్డూ విడదీశాడు. యంగ్‌ను ఔట్ చేయడంతో 75 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. శతకం దిశగా సాగుతున్న కాన్వేను అశ్విన్ అద్భుతమైన డెలివరీతో బౌల్డ్ చేయడంతో ఆ జట్టు మూడో వికెట్ కోల్పోయింది. రచిన్ రవీంద్ర (22 నాటౌట్), డారెల్ మిచెల్ (14 నాటౌట్) క్రీజులో ఉండగా తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ ఇప్పటికే 134 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.

1 స్వదేశం వేదికగా టెస్టుల్లో భారత్‌కు ఇదే అత్యల్ప స్కోరు (అంతకుముందు 1987లో వెస్టిండీస్‌పై 75 పరుగులకు ఆలౌట్). ఓవరాల్‌గా టీమ్‌ఇండియాకు అడిలైడ్ (36 ఆలౌట్) తర్వాత ఇది మూడో అత్యల్ప స్కోరు. ఆసియాలోనూ ఇదే చెత్త రికార్డు.

5 భారత ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన బ్యాటర్లు.

సొంతగడ్డపై టెస్టులు ఆడుతూ టాప్-7 బ్యాటర్లలో నలుగురు డకౌట్ అవడం ఇదే ప్రథమం.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 31.2 ఓవర్లలో 46 ఆలౌట్ (పంత్ 20, జైస్వాల్ 13, హెన్రీ 5/15, ఓరూర్కీ 4/22)

న్యూజిలాండ్ : 50 ఓవర్లలో 180/3 (కాన్వే 91, యంగ్ 33, జడేజా 1/28, అశ్విన్ 1/46)

క్వార్టర్స్‌కు సింధు

ఓడెన్స్: డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆశలు మోస్తున్న ఏకైక షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు.. 18-21, 21-12, 21-16తో ప్రపంచ ఆరో ర్యాంకర్ హాన్ యు (చైనా)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. తొలి గేమ్‌లో హోరాహోరీ పోరాడినా తృటిలో ఆ గేమ్‌ను చేజార్చుకున్న సింధు.. రెండో గేమ్ నుంచి జూలు విదిల్చింది. గంటా మూడు నిమిషాల పాటు జరిగిన ఈ పోరులోని నిర్ణయాత్మక మూడో గేమ్ ఒకదశలో సింధు 8-11తో వెనుకబడ్డా అనూహ్యంగా పుంజుకుని గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది.

ఢిల్లీ హెడ్‌కోచ్‌గా బదానీ

ఢిల్లీ: ఐపీఎల్‌లో ఇంతవరకూ ట్రోఫీ నెగ్గని జట్లలో ఒకటైన ఢిల్లీ క్యాపిటల్స్ 2025 సీజన్‌కు కొత్త హెడ్‌కోచ్‌ను నియమించుకుంది. భారత మాజీ క్రికెటర్ హేమాంగ్ బదానీ ఆ జట్టుకు వచ్చే సీజన్ నుంచి చీఫ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాక బదానీ ఐపీఎల్‌తో పాటు పలు ఇతర లీగ్‌లలో జట్లకు బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశాడు. కాగా ఆంధ్రాకు చెందిన మాజీ క్రికెటర్ వేణుగోపాల్ రావు ఢిల్లీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమితుడయ్యాడు. భారత మాజీ సారథి సౌరవ్ గంగూలీని జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమిస్తున్నట్టు ఢిల్లీ క్యాపిటల్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

దుబాయ్: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో గురువారం దుబాయ్ వేదికగా జరిగిన తొలి సెమీస్‌లో సౌతాఫ్రికా... 8 వికెట్ల తేడాతో కంగారూలను ఖంగు తినిపించింది. మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. బెత్ మూనీ (44), ఎల్లీస్ పెర్రీ (31) ఆసీస్‌ను ఆదుకున్నారు. అనంతరం ఛేదనను సౌతాఫ్రికా.. 17.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్నందుకుంది. అన్నెకె బోష్ (48 బంతుల్లో 74 నాటౌట్, 8 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించగా సారథి లారా వోల్వార్డ్ట్ (42) రాణించింది. ఈ టోర్నీ ప్రారంభ ఎడిషన్ (2009) తర్వాత ఆస్ట్రేలియా ఫైనల్‌కు చేరకపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

వివన్‌కు రజతం

భారత్‌కు 4 పతకాలు

ఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్ ఫైనల్-2024ను భారత్ 4 పతకాలతో ముగించింది. ఈ పోటీలలో భాగంగా గురువారం జరిగిన మెన్స్ ట్రాప్ ఈవెంట్‌లో వివన్ కపూర్ రజతం దక్కించుకోగా మెన్స్ స్కీట్ కాంపిటీషన్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకాకు కాంస్యం దక్కింది. ఫైనల్ బరిలో నిలిచిన ఆరుగురిలో వివన్.. 44 పాయింట్లు స్కోరు చేసి రజతం సాధించాడు. నరుకా 43 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గాడు. ఈ టోర్నీలో భారత్ 2 రజతాలు, 2 కాంస్యాలతో పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలిచింది.

'ఉప్పల్' కేసులో ఈడీ దూకుడు

- **అక్రమాలపై మూడు సంస్థలకు నోటీసులు**
- **ఈనెల 22న హాజరు కావాలని ఆదేశాలు**

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : ఉప్పల్ స్టేడియం నిధుల అక్రమాల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈనెల 8న హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్‌ను విచారించిన ఈడీ అధికారులు ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా గురువారం మూడు సంస్థలకు నోటీసులు ఇచ్చారు. వీటిల్లో బాడీడ్రెంచ్ ఇండియా, సరస్ స్పోర్ట్స్, ఎక్స్‌లెంట్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు ఉన్నాయి. వీటికి సంబంధించిన నిర్వాహకులు ఈనెల 22న ఈడీ ముందు ప్రత్యక్షంగా హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. జనరేటర్స్, జిమ్ పరికరాలు, క్రికెట్ బాల్స్, ఇతర వస్తువుల కొనుగోలుకు సంబంధించి ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే.

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వేదికగా ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 11వ సీజన్‌కు శుక్రవారం తెరలేవనుంది. ఇందుకోసం నిర్వహించిన మీడియా భేటీలో 12 జట్ల కెప్టెన్లు పాల్గొని సందడి చేశారు.

ఇంగ్లండ్ లక్ష్యం 297

ముల్తాన్: పాకిస్థాన్, ఇంగ్లండ్ మధ్య ముల్తాన్‌లో జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఓవర్ నైట్ స్కోరు 239/6తో మూడో రోజు ఆట ఆరంభించిన ఇంగ్లీష్ జట్టు.. 291 పరుగులకు ఆలౌట్ అయింది. స్పిన్నర్ సాజిద్ ఖాన్ (7/111) ఏడు వికెట్లతో తన కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. అనంతరం పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 221 పరుగులకే ఆలౌటైంది. సల్మాన్ (63) ఒక్కడే రాణించాడు. 297 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 11 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 36 పరుగులు చేసింది.

ఉదయ్, అభినయకు స్వర్ణాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఉదయ్‌కిరణ్, అభినయ స్వర్ణ పతకాలతో మెరిశారు. గురువారం జరిగిన పోటీల్లో పురుషుల 120కి. విభాగంలో ఉదయ్..డెడ్‌లిఫ్ట్, బెంచ్‌ప్రెస్‌లో కలిపి 300కిలోల బరువెత్తి టాప్‌లో నిలిచాడు. డార్విన్‌నెక్ట్స్ జనరేషన్ స్కూల్ విద్యార్థి అభినయ..52కిలోల కేటగిరీలో పసిడి సొంతం చేసుకుంది. 38కిలోల విభాగంలో ఆక్స్‌ఫర్డ్‌స్కూల్‌కు చెందిన తపస్యరావు అగ్రస్థానంతో స్వర్ణం దక్కించుకుంది. పతక విజేతలను రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు రేఖ అభినందించారు. జాతీయ టోర్నీకి ఉదయ్,అభినయ ఎంపికయ్యారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.